# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పోలవరం ప్రాజెక్టుని 2027లోగా పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఈ రోజు శాసనసభలో ప్రకటించారు.
- ❖ ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ చేనేత ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తున్నామని మంత్రి ఎస్.సవిత వెల్లడించారు.
- ❖ హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రభుత్వం 2,600 కోట్ల రూపాయలను కేటాయించిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
- ❖ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈనెల 21వ తేదీన అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==============================

రాష్ట్రానికి జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టుని 2027లోగా పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై ఈ రోజు జరిగిన లఘు చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే రాష్ట్రంలో కరవుకు ముగింపు పలికినట్లేనన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. 2014-19 మధ్య పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం మేర పూర్తి చేశామని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్ట్ విషయంలో రాజీ పడేది లేదని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

==============================

చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ రియింబర్స్ మెంట్ ఇవ్వబోతున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏడవ రోజు అయిన ఈ రోజు పలువురు శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే 3 ఆప్కో షోరూమ్ లను ఏర్పాటు చేశామని, 10 క్లస్టర్లను కూడా నెలకొల్పబోతున్నామన్నారు. మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ని అందిస్తామని తెలిపారు. చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా పథకం కూడా అమలు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 50 సంవత్సరాలకు పైబడిన చేనేత కార్మికులకు నెలకు 4 వేల రూపాయల పెన్షన్లు ఇస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కామర్స్ ద్వారా చేనేత వస్త్రాల విక్రయాలు చేపట్టామని, గడిచిన 6 నెలల కాలంలో 32 లక్షల 50 వేల రూపాయల అమ్మకాలు చేశామని తెలిపారు.

==============================

స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం నగరంలో ఈ రోజు మోడల్ టాయిలెట్ ను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వచ్ఛ శ్రీకాకుళం లక్ష్యంగా అంతా కలిసి పని చేయాలని కోరారు. పరిశుభ్రత సాధించాలంటే మరుగుదొడ్లను తప్పనిసరిగా వినియోగించాలని కేంద్రమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

==============================

రాష్ట్రంలో హంద్రీనీవా ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి 2,600 కోట్ల రూపాయలను బడ్జెట్ లో ప్రభుత్వం కేటాయించిందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసనసభలో ఈ రోజు ఆయన సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ... హంద్రీనీవా ప్రాజెక్టులో భాగమైన అడవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులను 2019లోనే టీడీపీ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. అడివిపల్లి రిజర్వాయర్‌కు నీరందించే మెయిన్ కెనాల్ పనులకు 360 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లుగా మంత్రి పేర్కొన్నారు.

విరామం

==============================

చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలకు 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. శాసనమండలిలో ఈ రోజు జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ... గ్రామాలను స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యతని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డు కోసం గ్రామాల్లో స్థల సేకరణ కష్టంగా ఉందని ఈ సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. 10 నుంచి 12 గ్రామాలకు కలిపి ఉమ్మడిగా డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. కాగా, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చామని ఉపముఖ్యమంత్రి వివరించారు.

==============================

దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాలు మీదుగా ఉపరితల ఆవర్తనం ఈ నెల 21న ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారులు తెలిపారు. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనించి ఆగ్నేయ బంగాళా ఖాతం మీదుగా ఈ నెల 23న అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వెల్లడించారు. ఆ తర్వాత, రెండు రోజుల లో మరింత బలపడి నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని వెల్లడించారు.

==============================

విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఇందుకూరి రఘురాజును శాసనమండలి అధికారికంగా గుర్తించింది. ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో ఆయనను ఎమ్మెల్సీగా గుర్తిస్తున్నామని ప్రకటించింది. కాగా విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్‌పై రఘురాజు హైకోర్టును ఆశ్రయించారు. ఎమ్మెల్సీ రఘురాజుపై మండలి ఛైర్మన్ తీసుకున్న అనర్హత వేటును రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది.

==============================

ఉమ్మడి కృష్ణా జిల్లా దీవి సీమలో 1977 నవంబర్ 19న జరిగిన ప్రకృతి వైపరీత్యంలో 14 వేల మంది మరణించారని మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి తెలిపారు. వారిని  స్మరించుకుని నివాళి ఈ రోజు స్థానికంగా జరిగిన కార్యక్రమంలో నివాళి అర్పించారు. మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న దివిసీమ పట్ల తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందన్నారు. అవనిగడ్డ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎంపీ బాలశౌరి తెలిపారు.

==============================

రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సహకార రంగం అందిస్తున్న పాత్ర మరువలేనిదని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సి. నాగరాణి అన్నారు. తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం గ్రామంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను కలెక్టర్ ఈ రోజు ప్రారంభించారు. సహకార సొసైటి నిర్వహిస్తున్న సూపర్ బజార్ ను ఆమె పరిశీలించారు. అనంతరం సహకారం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ... వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా సహకార రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు.

==============================

వ్యవసాయ రంగంలో వచ్చిన నూతన సాంకేతిక ఆవిష్కరణలలో డ్రోన్ పరిజ్ఞానం  ఒకటని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో డ్రోన్ సాంకేతికతపై శిక్షణ కార్యక్రమాలను ఆయన ఈ రోజు సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా డ్రోన్ సాంకేతికతపై శిక్షణకు కేంద్ర ప్రభుత్వ శిక్షణ సంస్థ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సత్యసాయి జిల్లాలను ఎంపిక చేసిందన్నారు.

==============================
==============================